quicktodaynews.com RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

QUICK TODAY DAILY దినపత్రిక తెలంగాణ



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సీజేఐ

వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేసిన ఈవో

2

## ఫోక్ సింగర్ మల్లిక్ తేజపై అత్యాచారం కేసు

బ్లాక్ మెయిలింగ్ పాల్పడుతున్నాడన్న యువతి ఫిర్యాదు

కేసు నమోదు చేసిన జగిత్యాల పోలీసులు



2

EDITOR : GILLALA BUCHI REDDY. 8125972476 | మల్కాజిగిరి | సంపుటి : 2 సంచిక : 20 | సోమవారం 30 సెప్టెంబర్ 2024 | వెల : 3 రూ/.. | పేజీలు - 8

# మరో ఆరు కారిడార్లు

## రూ. 32,237 కోట్ల వ్యయంతో 116.2 కి.మీలతో మెట్రో రెండో దశ విస్తరణ

### మెట్రో రైలు డీపీఆర్‌పై సీఎం రేవంత్ సమీక్ష

### నాగోలు నుంచి విమానాశ్రయానికి పొడిగింపు

### ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి అనుసంధానం



**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (క్విక్ టుడే న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్ మారుస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.. మెట్రో రైలు రెండో దశ డీపీఆర్‌కు తుది మెరుగులు దిద్దారు. మొత్తం 116.2 కిలోమీటర్లలో మెట్రో రెండు దశ నిర్మాణం జరగనుంది. రూ. 32,237 కోట్ల అంచనా వ్యయంతో మెట్రో రైలు రెండో దశ చేపట్టనున్నారు. రెండో దశలో కొత్త ఫ్యూచర్ సిటీకి మెట్రోను ఏర్పాటు చేయనున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి స్కిల్ వర్సిటీ వరకు 40 కి.మీ. మేర మెట్రో మార్గాన్ని నిర్మించనున్నారు. ఇటీవలే మెట్రో రైలు రెండో దశ డీపీఆర్‌లపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. ఆరాంఘర్-బెంగుళూరు హైవే, కొత్త హైకోర్టు మీదుగా విమానాశ్రయానికి మెట్రో లైన్ ఖరారు చేసింది. కారిడార్-4లో భాగంగా నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకూ 36.6 కిలోమీటర్ల మార్గానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎయిర్ పోర్ట్ కారిడార్‌లో 1.6 కిలోమీటర్ల మెట్రో లైను భూగర్భం నుంచి వెళ్లనుంది. ఈ మార్గంలో ఎయిర్ పోర్ట్ స్టేషన్ సహా మొత్తం 24 మెట్రో స్టేషన్లు ఉంటాయి. మెట్రో కారిడార్-5 రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి కోకాపేట్ నియోపోలిస్ వరకు బయో డైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్, నానక్ రామ్ గూడ జంక్షన్, విప్రో సర్కిల్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట్ నియోపోలిస్ మీదుగా నిర్మిస్తారు. ఇది మొత్తం ఎలివేటెడ్ కారిడార్. ఇందులో దాదాపు 8 స్టేషన్లు ఉంటాయి. కారిడార్-6లో ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణ్ గుట్ట వరకు గ్రీన్ లైన్

మిగతా 2లో..





## సామాన్యులకు మేలు జరిగేలా

# కొత్త రెవెన్యూ చట్టం

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

### అంగుళం ప్రభుత్వ భూమి కూడా ఆక్రమణకు గురి కావొద్దు

### కలెక్టర్ అనుమతితోనే తహశీల్దార్ల పై కేసులు నమోదు చేయాలి

### రెవెన్యూ ఉద్యోగులకు ట్రైనింగ్ సెంటర్

### తహసీల్దార్ల బదిలీలపై త్వరలో ఉద్యోగ సంఘాలతో సమావేశం

### ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తాం

### షామీర్ పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో తహసీల్దార్లతో సమావేశం

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (క్విక్ టుడే న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను దుర్వినియోగపరిచిన విధానాన్ని, జరిగిన తప్పులను సరిచేసి రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసి, బలోపేతం చేసే దిశగా పటిష్టమైన విధానాన్ని రూపొందిస్తున్నామని రెవెన్యూ, హౌసింగ్,

మిగతా 2లో..

# పేదల జోలికి వెళ్లొద్దు

### ప్రత్యామ్నాయం చూపకుండా ఇండ్లను కూల్చడం సరికాదు

### ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (క్విక్ టుడే న్యూస్):** మూసీ ప్రక్షాళన, హైడ్రా పేరుతో నిరుపేదల ఇండ్లను అమానవీయంగా కూల్చివేస్తున్న సంఘటనపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన ఆరోపణలు చేశారు. మూసీ పరీవాహకంలో కూల్చివేతలపై ఆయన స్పందిస్తూ పేదల ఇండ్లను కూల్చివేయొద్దని ప్రభుత్వానికి సూచించారు. ఎలాంటి ప్రత్యామ్నా మార్గాలు చూపకుండా పేదల ఇండ్లను కూల్చి వేయడం సరికాదన్నారు. నగరంలో జలవిహార్, హైమ్యాక్స్ లాంటివి ఎన్నో అక్రమ కట్టడాలు చాలా ఉన్నాయి. అలాంటి వాటిని వదిలిపెట్టి సామాన్యుల ఇండ్లను కూల్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఇండ్లకు రెడ్ మార్క్ పెట్టం తొందరపాటు చర్యగా అభివర్ణించారు. కూల్చిన ఇండ్లకు స్థానికంగానే బాధితులకు వసతి కల్పిస్తే మంచిదని సూచించారు. పేదలు నివసించే స్లమ్ జోలికి వెళ్లొద్దని తాను ముందే చెప్పానని గుర్తు చేశారు.

## పెద్దలను వదిలి

# పేదలపై ప్రతాపమా?

### హామీల అమలుకు డబ్బేలేదు.. మూసీ ప్రక్షాళనకు లక్షన్నర కోట్లు ఎక్కడివి?

### కాంగ్రెస్ హస్తం గుర్తు తీసేసి, బుల్డోజర్ గుర్తు పెట్టుకోండి

### మూసీ బాధితులకు అండగా ఉంటాం

### మాజీ మంత్రి బీఆర్ ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు



**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (క్విక్ టుడే న్యూస్):** అధికారం కోసం మీరు ఇచ్చిన హామీలైన వృద్ధులకు పింఛన్, రైతులకు రైతుబంధు, మహిళలకు 2500 ఇవ్వు, ఉద్యోగులకు డీఏ వంటివి నెరవేర్చలేక చతికిలబడ్డ ప్రభుత్వానికి ఇప్పుడు మూసీ ప్రక్షాళనకు లక్షా యాబై వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని మాజీ మంత్రి సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కూల్చివేతలపై ఆయన స్పందించారు. ఆదివారం . హైదర్‌షాకోట్‌లో మూసీ, హైడ్రా బాధితులఇండ్లను పరిశీలించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మీ బాధ చూస్తుంటే.. నా కళ్లలో నీళ్లు వస్తున్నాయ్.. మీ బాధలు వింటుంటే.. మీ కన్నీళ్లు

మిగతా 2లో..

## హిజ్బొల్లా డిప్యూటీ హెడ్

# నబిల్ కౌక్ హతం



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29:** హమాస్, హిజ్బొల్లా మిలిటెంట్ సంస్థలను నామరూపాల్లేకుండా చేయాలని ఇజ్రాయెల్ కంకణం కట్టుకుంది. ఇప్పటికే హిజ్బొల్లా చీఫ్ సయ్యద్ హసన్ నస్రల్లాను హతమార్చిన ఇజ్రాయెల్... లెబనాన్ భూభాగంలో ఆదివారం జరిపిన దాడుల్లో హిజ్బొల్లా డిప్యూటీ హెడ్ నబిల్ కౌక్ ను అంతమొందించింది. నబిల్ కౌక్ ను రాకెట్ దాడులతో మట్టుబెట్టినట్టు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. అయితే, కౌక్ మృతి పట్ల హిజ్బొల్లా నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. సోషల్ మీడియాలో మాత్రం అతడి మృతికి సంతాప ప్రకటనలు వెలువడుతున్నాయి. హిజ్బొల్లా అగ్రశ్రేణి కమాండర్లలో ఒకడిగా ఉన్న నబిల్ కౌక్ ను అమెరికా కూడా నిషేధిత జాబితాలో చేర్చింది. నాలుగేళ్ల కిందట అతడిపై పలు ఆంక్షలు విధించింది.

## అక్టోబర్ 2న కొత్త రాజకీయ పార్టీ

# జన సూరజ్

### రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక ప్రకటన



**పాట్నా, సెప్టెంబర్ 29:** ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కీలక ప్రకటన చేశారు. అక్టోబర్ 2న బీహార్‌లో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పార్టీ పేరు, నాయకత్వంతో సహా అన్ని వివరాలు ఆ రోజు వెల్లడిస్తానని స్పష్టం చేశారు. 'జన సురాజ్'

మిగతా 2లో..

## తిరుమల కల్తీ లడ్డూపై

# సిట్ దర్యాప్తు స్పీడ్

### తిరుమలలో ఇన్వెస్టిగేషన్ ప్రారంభించిన సర్వశ్రేష్ఠ త్రిపాఠి టీమ్



**తిరుమల, సెప్టెంబర్ 29 (క్విక్ టుడే న్యూస్):** తిరుమల లడ్డులో కల్తీ నెయ్యి కేసులో సిట్ దర్యాప్తు స్పీడు అందుకుంది. ఏపీ సర్కార్ ఏర్పాటు చేసిన సిట్ తిరుపతిలో కొనసాగుతోంది. నిన్న తిరుమల వెంకన్నను దర్శించుకుని దర్యాప్తు చేపట్టిన

మిగతా 2లో..

RNI NO : TELTEL/2023/86487

క్విక్ టుడే

QUICK TODAY

సోమవారం 30 సెప్టెంబర్ 2024

quicktodaynews.com



# మరో ఆరు కారిడార్లు

నిర్మిస్తారు. కారిడార్-7లో మార్గం ముంబై హైవేపై రెడ్ లైన్‌కు కొనసాగింపుగా నిర్మిస్తున్నారు. ఇది ప్రస్తుతం ఉన్న మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి స్టార్టయి..పటాన్‌చెరు వరకు నిర్మిస్తారు. 13.4 కిలోమీటర్ల ఈ మార్గంలో 10 స్టేషన్లు ఉంటాయి. కారిడార్-8 విజయవాడ హైవేపై ఎల్బీ నగర్ నుంచి హయత్ నగర్ వరకు 7.1 కి.మీ మార్గం నిర్మిస్తారు. ఈ పూర్తి ఎలివేటెడ్ కారిడార్‌లో దాదాపు 6 స్టేషన్లు ఉంటాయి. వివిధ ప్రత్యామ్నాయాల గురించి లోతైన చర్చల తర్వాత, ముఖ్యమంత్రి మెట్రో రెండో దశ కారిడార్‌ల విస్తృత కాంటూర్ లను ఆమోదించారు, ప్రస్తుతం 3 కారిడార్లలో 69 కిలోమీటర్ల మేర హైదరాబాద్‌లో మెట్రో సర్వీసులు నడుస్తున్నాయి. 116.2 కిలోమీటర్లలో 32 వేల 237 కోట్ల అంచనా వ్యయంతో రెండో దశ పనులు చేపట్టనున్నారు. రెండో దశ కూడా పూర్తయితే మొత్తం 9 కారిడార్లలో 185 కిలోమీటర్ల మెట్రో మార్గం అందుబాటులో ఉండనుంది. మరోవైపు 8 వేల కోట్ల అంచనాతో ఫ్యూచర్ సిటీకి మెట్రో సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్తగా ఏర్పాటు చేయనున్న ఆరు కారిడార్లు ఇవే..

కారిడార్ 4: నాగోల్ -నుంచి (ఎయిర్ పోర్ట్ కారిడార్) 36.6 కి.మీ
కారిడార్ 5 : రాయదుర్గ్ - కోకాపేట్ నియోపోలిస్ 11.6 కి.మీ
కారిడార్ 6: ఎంజీబీఎస్ - చంద్రాయన్ గుట్ట (ఓల్డ్ సిటీ కారిడార్) 7.5 కి.మీ
కారిడార్ 7: మియాపూర్ - పటాన్ చెరు 13.4 కి.మీ
కారిడార్ 8: ఎల్ బి నగర్ - హయత్ నగర్ 7.1 కి.మీ
కారిడార్ 9 : ఆర్‌జీఐఏ - ఫోర్త్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) 40 కి.మీ మొత్తం 116.2 కి.మీ.

### సామాన్యులకు మేలు జరిగేలా

# కొత్త రెవెన్యూ చట్టం



సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. సామాన్యులకు, రైతులకు మేలు జరిగేలా కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకురాబోతున్నామని, ఇప్పటికే ఇందుకు సంబంధించిన కసరత్తు చివరి దశకు చేరుకుందన్నారు. షామీర్ పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో ఆదివారం నాడు 33 జిల్లాల తహశీల్దార్లతో మంత్రిగారు ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆస్తులు, స్థలాలు కాపాడే విషయంలో పేదలకు సహాయం అందించడంలో రెవెన్యూ యంత్రాంగం పనితీరు మరింత మెరుగుపడాలని మరింత వేగం పెరగాలని అన్నారు. ఒక్క అంగుళం ప్రభుత్వ భూమి కూడా ఆక్రమణలకు గురి కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ఇందుకు సంబంధించిన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సిబ్బంది పూర్తిగా సహకరించాలి, వారి సమస్యలను పరిష్కరించాలి. రెవెన్యూ ఉద్యోగులు మరింత పట్టుదలతో సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూముల పరిరక్షణతో పాటు, అభివృద్ధి సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్దిదారులను గుర్తించడంలోను, వారికి సంక్షేమ పథకాలను అందించడంలోను రెవెన్యూ యంత్రాంగం పాత్ర కీలకమైనది. అందులో తహశీల్దార్ల పాత్ర అతి ముఖ్యమైనది. ప్రభుత్వానికి ప్రజలకు రెవెన్యూ శాఖ వారధిగా ఉంటుంది. ఈ విభాగం సమర్థవంతంగా పనిచేసినప్పుడే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు, ఆకాంక్షలు నెరవేరి ప్రభుత్వం కోరుకున్న ఫలితాలు లభిస్తాయని అన్నారు. ప్రజలు కోరుకుంటున్న దిశలో రెవెన్యూ వ్యవస్థ పనిచేస్తుందా, లేదా అని ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చే రైతులు, పేదలు, సామాన్యులకు వీలైనంత మేరకు చేయగలిగినంత సహాయం చేయాలని ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఈ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా కూడా పేదసామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటుంది. వీధి విధానాలు రూపొందిస్తుంది. దానికి అనుగుణంగానే క్షేత్రస్థాయిలో తహశీల్దార్లు పని చేయాలి. కలెక్టర్ నుండి అనుమతి తీసుకున్న తర్వాతే తహశీల్దార్ల మీద కేసులు నమోదు చేసేలా రాష్ట్ర డీజీపితో చర్చించి త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. అలాగే రెవెన్యూ సిబ్బంది కోసం హైదరాబాద్ లో ట్రైనింగ్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం హడావుడిగా మండలాల సంఖ్యను పెంచింది కానీ, దానికి తగినట్టుగా కార్యాలయాలను ఏర్పాటు చేయలేదని, చేసిన వాటిలో మౌళిక వసతులు కూడా ఏర్పాటు చేయలేదని అవసరమేరకు సిబ్బందిని కూడా నియమించలేదని వీటిని దృష్టిలో పెట్టుకుని తహశీల్దార్ల కార్యాలయాలలో మౌళిక వసతులను కల్పించడంతో పాటు రెగ్యులర్ స్టాఫ్, పదోన్నతులు, కోర్టు ఖర్చులు, అద్దె భవనాలు, అద్దె వాహన బకాయిలతో పాటు అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహశీల్దార్ల బదిలీలపై ఉద్యోగ సంఘాలతో చర్చించి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ప్రభుత్వానికి అత్యంత కీలకమైనదని ఈ శాఖ బాగా పనిచేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుంది, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్నారు. దాదాపు ఐదు సంవత్సరాలనుంచి పెండింగ్ లో ఉన్న 300 మంది ఉద్యోగుల మెడికల్ రీయంబర్స్మెంట్ ఫైళ్లను మంత్రిగారు క్లియర్ చేశారని వెల్లడించారు. సుధీర్ఘంగా జరిగిన ఈ సమేవేశంలో దాదాపు రెండు గంటలపాటు వివిధ జిల్లాలనుంచి వచ్చిన తహశీల్దార్లు గత ప్రభుత్వంలో ఎదురైన సమస్యలను వాటి వల్ల ప్రజలు ఎదురుకొన్న ఇబ్బందులను భవిష్యత్తులో ఏ విధంగా చేస్తే బాగుంటుందని పలు అంశాలను ఈ సమావేశంలో ప్రస్తావించారు. ఈ సమావేశంలో మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పొత్రు ఐఏఎస్, ట్రెసా అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గౌతమ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ అసోసియేషన్ అధ్యక్షులు వి. లచ్చి రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

### తిరుమల కల్తీ లడ్డూపై

# సిట్ దర్యాప్తు స్పీడ్

సిట్ ఈ రోజు ఈఓ తో భేటీ అయ్యింది. ఎంక్వైరీ కంటిన్యూ చేస్తున్న టిటిడి వర్క్ డివైడ్ చేసుకుని పక్కా యాక్షన్ ప్లాన్ లోకి దిగింది. అదనపు సిబ్బందితో పలు ప్రాంతాలకు వెళ్లి దర్యాప్తు చేపట్టనుంది. దేశ వ్యాప్తంగా చర్చనీయ అంశంగా మారిన తిరుమల లడ్డూ నెయ్యి వివాదంపై విచారణ ఏం తేల్చబోతోందన్న ఉత్కంఠ నెలకొంది. తిరుపతిలో మకాం వేసిన సిట్ దర్యాప్తు ఎలా జరగనుందన్న అంశం ఆసక్తిగా మారింది. సిట్ చీఫ్ సర్వ శ్రేష్ట త్రిపాఠి బృందం ఇన్వెస్టిగేషన్ ఫోకస్ తప్పు చేసిన వారి భరతం పట్టేలా ఉంది. తిరుమల నుంచే ప్రక్షాళన షురూ అయ్యిందన్న సీఎం చంద్రబాబు తిరుమల లడ్డు నెయ్యి కల్తీ వ్యవహారాన్ని సీరియస్ గా పరిగణించడంతో సిట్ ఎంక్వయిరీ కూడా అదే రీతిలో జరుగుతుంది. టీటీడీ ఈవోగా శ్యామలరావును నియమించిన ప్రభుత్వం అందులో భాగంగానే ఆయనకు రెండు టాస్క్ లు ఇచ్చింది. లడ్డూలో నాణ్యత లేమికి కల్తీ నెయ్యి కారణమన్న అనేక ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకొని లడ్డూపై ఫోకస్ పెట్టాలని ఆదేశించింది. ఇందులో భాగంగానే లడ్డు ఆపరేషన్ ప్రారంభం కాగా నెయ్యిలో నాణ్యత లేదన్న విషయం తేలింది. ముందుగా వెజిటేబుల్ ఫ్యాట్ ఉందని గుర్తించిన టిటిడి ఎన్‌డీడీబీ ల్యాబ్ రిపోర్ట్ లతో యానిమల్ ఫ్యాట్ తేల్చింది. ఈ అంశమే దేశవ్యాప్తంగా రచ్చరాజేసింది. ఏపీ సర్కార్ నిజాలు డిక్కు తేల్చేందుకు సిద్ధం చేసింది. సిట్ ఏర్పాటుకు కారణం అయింది. తిరుపతి ఈస్ట్ పిఎస్ లో టీటీడీ ఇచ్చిన ఫిర్యాదుపై నమోదైన కేసు డైరీ ని టేకప్ చేసిన సిట్ లోతైన దర్యాప్తుకు శ్రీకారం చుట్టింది. సిట్ హెడ్ గా సర్వశ్రేష్ట త్రిపాఠి నేతృత్వం వహించగా 9 మంది టీం తిరుపతిలో మకాం పెట్టి ఇన్వెస్టిగేషన్ కొనసాగిస్తోంది. పోలీస్ గెస్ట్ హౌస్ కేంద్రంగా రెండ్రోజులుగా సాగుతున్న దర్యాప్తు ఇప్పటి వరకు గుర్తించిన అంశాలు, వివాదాలపై ఫోకస్ పెట్టింది. సిట్ మూడు బృందాలు విడిపోయి విచారణ చేపట్టబోతోంది. తిరుమలలో సిబ్బంది, అధికారుల నుంచి వివరాలు సేకరించడంతో పాటు నెయ్యి కొనుగోలు, వినియోగంపై ఆరాతీస్తోంది. మరో వైపు తమిళనాడులోని దిండిగల్ లో ఉన్న ఏఆర్ డెయిరీ సెంట్రిక్ గా ఎంక్వైరీ చేస్తోంది. టీటీడీ నెయ్యి సరఫరా టెండర్ దక్కించుకున్న ఏఆర్ డెయిరీ వివరాలు, సప్లై అంశాలను రాబట్టబోతుంది. ఏఆర్ డయిరీ సప్లై చేసిన నెయ్యి లో కల్తీని, ఎస్ వాల్యూస్ తేడాను బయటపెట్టిన గుజరాత్ ఎన్‌డీడీబీకి ల్యాబ్ రిపోర్టులను పరిశీలిస్తున్న సిట్ అవసరమైతే అక్కడికే వెళ్లి ఆరా తీయబోతుంది.

### అక్టోబర్ 2న కొత్త రాజకీయ పార్టీ

# జన సూరజ్

పేరుతో బీహార్‌లో పాదయాత్ర చేస్తున్న ప్రశాంత్ కిషోర్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'అక్టోబరు 2న కొత్త పార్టీ 'జన సూరజ్'తోపాటు నాయకత్వ ప్రకటన గురించి మీరు తెలుసుకుంటారు. నేను నాయకుడిని కాదు. నాయకుడు కావాలని ఎప్పుడూ ఆశించలేదు. అక్టోబర్ 2న ఏర్పాటవుతున్న ఈ పార్టీకి నేనెప్పుడూ నాయకుడిగా ఉండను. ప్రజలు నాయకత్వ పాత్ర పోషించాల్సిన సమయం ఇది' అని అన్నారు. కాగా, 2022 అక్టోబర్ 2న చేపట్టిన 'జన సూరాజ్' పాద యాత్ర మొదటి దశలో భాగంగా బీహార్‌లో 60 శాతం ప్రాంతాలను పూర్తి చేసినట్లు ప్రశాంత్ కిషోర్ తెలిపారు. ఈ యాత్రకు నిర్ణీత రోజులు లేదా కిలోమీటర్ల సంఖ్య లేదన్నారు. ప్రధానంగా మూడు ఉద్దేశాలు నెరవేర్చడం కోసం బీహార్‌లోని ప్రతి మూలకు వెళ్లాలన్నది తన లక్ష్యమని తెలిపారు. మరోవైపు కొత్త పార్టీ ఏర్పాటు తర్వాత కూడా తన పాదయాత్ర ఆగదని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. మరో ఏడాది లేదా రెండేళ్ల వరకు ఇది కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీహార్ సవాళ్లకు పరిష్కారాలతో రెండో దశ యాత్ర ప్రణాళికను 2025 ఫిబ్రవరి లేదా మార్చిలో ప్రకటించనున్నట్లు తెలిపారు.

### పెద్దలను వదిలి

# పేదలపై ప్రతాపమా?



చూస్తుంటే.. రాతి గుండె కూడా కరిగిపోతుంది.. కానీ, రేవంత్ గుండె ఎందుకు కరుగతలేదో నాకు అర్థం కావాట్లేదు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ధైర్యంగా ఉండండి.. ఆత్మవిశ్వాసం కోల్పోవద్దన్నారు. రేవంత్ ప్రభుత్వం.. మీ ఇండ్లు ముట్టుకోకుండా మేం అండగా ఉంటామని ధైర్యం ఇచ్చారు. బుల్డోజర్లు వచ్చినా.. జేసీబీలు వచ్చినా.. ముందు మిమ్మల్ని దాటి రావాలి. హైడ్రా పుణ్యామా అని ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. మీరు అధైర్య పడొద్దు.. ప్రాణాలు తీసుకొవద్దు.. మీ ఇండ్లకు ఏం కాకుండా మేము అడ్డుపడతామని భరోసా కల్పించారు. 1994లో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే బాధితులందరికీ అనుమతులిచ్చిందని హరీశ్‌రావు గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి.. మీ తప్పిదాలకు పేదలకు ఎందుకు బలికావాలని ప్రశ్నించారు. ఇందిరమ్మ పాలన అంటే%%% పేదలకు కూడు, గుడ్డ, నీడ ఇచ్చేది. కానీ మీ హయాంలో ఇందిరమ్మ పాలన పేదల బతుకులు కూల్చే ప్రయత్నం చేస్తున్నావ్. తెలంగాణలో బుల్డోజర్ రాజ్యం నడుస్తోంది. కాంగ్రెస్ హస్తం గుర్తు తీసేసి, బుల్డోజర్ గుర్తు పెట్టుకోండి అని హరీశ్‌రావు సూచించారు. దేశాన్ని కాపాడటం కోసం సరిహద్దులో పోరాటం చేసిన సైనికులు.. ఇప్పుడు ఇండ్లు కాపాడుకునేందుకు పోరాటం చేయాల్సి వస్తోంది.. రేవంత్‌రెడ్డి.. నీ ప్రభుత్వ జీవిత కాలం ఐదేండ్లు మాత్రమే.. బలిసినోళ్ల దగ్గరుండి కట్టిస్తున్నావ్.. పేదల ఇండ్లకు మాత్రం నోటీసులిస్తావా..అని ప్రశ్నించారు. పేదలకు బీఆర్ఎస్ పార్టీ, అండగా నిలుస్తుందని వారికి ధైర్యాన్ని ఇచ్చారు.

### తిరుమల శ్రీవారిని

# దర్శించుకున్న సీజేఐ

**తిరుమల, సెప్టెంబర్ 29 (క్విక్ టుడే న్యూస్) :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదివారం కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సీజేఐ కుటుంబానికి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి స్వాగతం పలికారు. సీజేఐ చంద్రచూడ్, ఆయన అర్ధాంగి కల్పనా దాస్, ఇతర కుటుంబ సభ్యులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు. అధికారులు తీర్థప్రసాదాలు అందించారు. టీటీడీ ఈవో జె.శ్యామలరావు జస్టిస్ చంద్రచూడ్ కు లామినేషన్ చేసిన వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు.

### ఫోక్ సింగర్

# మల్లిక్ తేజపై అత్యాచారం కేసు

**జగిత్యాల, సెప్టెంబర్ 29 (క్విక్ టుడే న్యూస్) :** తెలంగాణ జానపద గాయకుడు మల్లిక్ తేజ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మల్లిక్ తేజ తనపై పదేపదే అత్యాచారానికి పాల్పడ్డాడని, బ్లాక్ మెయిలింగ్ కు పాల్పడుతూ, వేధిస్తున్నాడని ఆ యువతి జగిత్యాల పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మల్లిక్ తేజ తెలంగాణ సాంస్కృతిక సారథి (టీఎస్ఎస్) సంస్థలో పనిచేస్తున్నాడు. ఈ సంస్థ ప్రభుత్వ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో నడుస్తోంది. కాగా, మల్లిక్ తేజా, బాధితురాలు గత కొన్నేళ్లుగా సాంస్కృతిక కార్యక్రమాలలో కలిసి పనిచేస్తున్నారు. తమ యూట్యూబ్ చానళ్లలో అనేక పాటలను అప్ లోడ్ చేశారు. అయితే, మల్లిక్ తేజ తనపై అత్యాచారానికి పాల్పడడమే కాకుండా, తనను, తన కుటుంబ సభ్యులను దూషిస్తున్నాడని ఆ యువతి తెలిపింది. తన యూట్యూబ్, ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ల పాస్ వర్డ్ లను కూడా మార్చేశాడని... తద్వారా తనను మానసికంగా వేధించాడని ఆరోపించింది. కొన్నేళ్లపాటు అతనితో కలిసి పనిచేశానని..ఈ క్రమంలో తనకు దారుణమైన అనుభవాలు ఎదురయ్యాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు..పరారీలో ఉన్న మల్లిక్ తేజ కోసం గాలింపు చేపట్టారు.




# మహిళలకు ఆరోగ్య రక్షణ

## సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (క్విక్ టుడే న్యూస్):** మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి సాధికారతతో పాటు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చెప్పారు. మహిళల ఆరోగ్యమే కుటుంబాలకు బలమని, సమాజ శ్రేయస్సుకు అదే పునాది అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణ, సంక్షేమం కోసం మరిన్ని ఆసుపత్రులు నిర్మిస్తామని, సంబంధిత వ్యవస్థలను బలోపేతం చేస్తామని తెలిపారు. బ్రెస్ట్ క్యాన్సర్ పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సుధా రెడ్డి ఫౌండేషన్ నేతృత్వంలో గచ్చిబౌలి స్టేడియం వేదికగా జరిగిన 'పింక్ పవర్ రన్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పక్షి అకృతిలో అతిపెద్ద మానవహారంగా ఏర్పడిన వలంటీర్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, శాట్ చైర్మన్ శివసేనా రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, పలువురు వైద్యులు, సుధా రెడ్డి ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# తెలంగాణలో బతుకమ్మ సందడి

## తొమ్మిది రోజుల పాటు సాగనున్న పూలపండగ

**హైదరాబాద్, సెప్టెంబర్ 29 (క్విక్ టుడే న్యూస్):** తెలంగాణ పూల జాతరకు వేళైంది..తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో సంబురంగా జరుపుకునే పండుగ బతుకమ్మ రానే వచ్చేసింది. ప్రతీ యేటా భాద్రపద అమావాస్య మొదలు ఆశ్వియుజ శుక్ల అష్టమి వరకు తొమ్మిది రోజులు బతుకమ్మ పండుగ జరుపుకుంటారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు జీవన విధానానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ వేళ తొమ్మిది రోజుల పాటూ రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా ఎక్కడ చూసినా సందడే కనిపిస్తుంది. మహిళలు ఆడిపాడి ఆనందిస్తారు. ఊరూరా మహిళల సందడి కనువిందు చేయనుంది. ఈ తొమ్మిది రోజుల పాటు మహిళలు రోజుకో విధమైన బతుకమ్మను పేర్చి పండుగ సంబరాలు జరుపుకుంటారు. చిన్నా పెద్దా వేడుకలలో పాల్గొంటారు. ముచ్చటగా ముస్తాబై బతుకమ్మలు తయారు చేసి అంతా కలసి ఆడిపాడతారు. ఎంగిలి పూల బతుకమ్మతో మొదలై సద్దుల బతుకమ్మతో సంబరాలు ముగుస్తాయి. అలిగిన బతుకమ్మ ఒక్క రోజు మినహా మిగతా ఎనిమిది రోజులు వైవిధ్యమైన నైవేద్యాలు అమ్మవారికి సమర్పిస్తారు. తీరొక్క పూలను అందంగా స్తూపం, శంఖం, గోపురం ఆకారంలో అమర్చుకుంటారు. బతుకమ్మను ప్రధానంగా తంగేడు పూలు, గునుగు, గుమ్మడి, మందార, బంతి, చేమంతి, అడవి చామంతి, గోరింట, బీర పువ్వులతో పేరుస్తుంటారు. ఈ ఏడాది బతుకమ్మ పండుగ అక్టోబర్ 2 నుంచి 10 తేదీ వరకు జరుపుకోనున్నారు. ఈ యేడు విస్తారంగా కురిసిన వర్షాలతో ఎటు చూసిన అడవి పూలు అందంగా విరబూసి పలకరిస్తున్నాయి. అలాగే చెరువుఉల జలకళను సంతరించుకున్నాయి. భక్తితో



బతుకమ్మను పూజించేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి సమర్పించే నైవేద్యాలకు అనుగుణంగా బతుకమ్మ పేర్లు కూడా ఉంటాయి. సద్దుల బతుకమ్మ చివరి రోజు పోయిరా బతుకమ్మ అంటూ వాటిని నీటిలో వదిలి ఆడవాళ్ళు అమ్మవారికి నమస్కారం చేసుకుంటారు.